
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



అల్లూరి సీతారామరాజు జిల్లా వార్తలు

గురువారం 7 మార్చి 2024

స్థిరంగా కనిష్ఠ ఉష్ణోగ్రతలు

పాడేరు, మార్చి 6(ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు స్థిరంగా కొనసాగుతున్నాయి. జి.మాడుగులలో 12.9, అరకులోయలో 13.8, చింతపల్లిలో 14.1, పాడేరులో 14.5, పెదబయలులో 15.3, హుకుంపేటలో 15.6, ముంచంగిపుట్టులో 16.1, అనంతగిరిలో 16.9 డిగ్రీల సెల్సియస్ కనిష్ఠ ఉష్ణోగ్రతలు బుధవారం నమోదయ్యాయి. రాత్రి వేళల్లో ఒక మోస్తరు చలి కొనసాగుతున్నది. పాడేరు మినహా పలు ప్రాంతాల్లో తెల్లవారుజాము నుంచి ఉదయం ఎనిమిది గంటల వరకు ఒక మోస్తరుగా పొగమంచు కురుస్తున్నది.

దారంతా గోతులు

50 కిలోమీటర్ల మార్గంలో 300 పైగా గతుకులు

- రాకపోకలకు ఇబ్బందులు
- సమయం వృథా, వాహనాలకు మరమ్మతులు
- పాడేరు- ముంచంగిపుట్టు మెయిన్‌రోడ్డు దుస్థితి ఇది
- కనీస అభివృద్ధికి నోచుకోని వైనం
- పాడేరు, అరకులోయ ఎమ్మెల్యేలు పట్టించుకోవడం లేదని విమర్శలు

(పాడేరు- ఆంధ్రజ్యోతి)

జిల్లాలోని పలు రహదారులు గోతులమయంగా ఉన్నాయి. గతంలో గంట వ్యవధిలో గమ్యస్థానానికి చేరుకునే వాహనచోదకులు ఇప్పుడు అదే మార్గంలో ప్రయాణించాలంటే రెండు గంటల సమయం పడుతోంది. పాడేరు నుంచి ముంచంగిపుట్టు వెళ్లే రహదారే దీనికి నిదర్శనం. ఈ మార్గంలో 300లకు పైగా గోతులు ఉండడం వల్ల వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయని, ఒళ్లు హూనమవుతోందని వాహనచోదకులు వాపోతున్నారు.



పెదబయలు మండలం బంగారుమెట్ట వద్ద గోతులమయంగా ఉన్న రహదారి



పెదబయలుకు సమీపంలో పన్నెడ వద్ద అధ్వానంగా ఉన్న మెయిన్‌రోడ్డు

ఎక్కడైనా 50 కిలోమీటర్ల మేర ఉన్న రోడ్డులో ఐదో, పదో గోతులు ఉండడం సహజం. కానీ పాడేరు నుంచి ముంచంగిపుట్టు వెళ్లే 50 కిలోమీటర్ల ప్రధాన రహదారిలో 300లకు పైబడి గోతులు ఉండడంతో రాకపోకలకు వాహనచోదకులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. చాలా ఏళ్లగా గోతులు పూడ్చకపోవడంతో ఈ మార్గంలో ప్రయాణించే వారు నిత్యం నరకం చూస్తున్నారు. పాడేరు నుంచి 50 కిలోమీటర్ల దూరంలో వున్న ఏజెన్సీ మారుమూల ముంచంగిపుట్టు వెళ్లే మెయిన్‌రోడ్డుకు చాలా ఏళ్లగా కనీస మరమ్మతులు చేపట్టలేదు. గత ప్రభుత్వంలో మంజూరైన కొన్ని బిట్‌లతో గతేడాది కొంత మేరకు తారురోడ్డు వేశారు. కానీ మొత్తం రోడ్డులో అధిక భాగం గోతులమయంగా ఉండడంతో పాడేరు- ముంచంగిపుట్టు ప్రయాణమంటే జనం హడలిపోతున్నారు.

మొత్తం రోడ్డంతా గోతులే...

పాడేరు నుంచి ముంచంగిపుట్టు మండల కేంద్రానికి వెళ్లే వరకు మొత్తం గోతులే ఉండడంతో వాహనచోదకులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ మార్గంలో పాడేరు మండలం పరిధిలో గబ్బంగి గుత్తులపుట్టు, హుకుంపేట మండలం ఎం.బొడ్డాపుట్టు, మఠం, గంపరాయి, ఈదులపుట్టు, మంగబంద, చుట్టుమెట్ట, అడుగులపుట్టు, పురుగుడుపుట్టు, బంగారుమెట్ట, వన్నెడ, పెదబయలు, తమరాడ, అడుగులపుట్టు, ముంచంగిపుట్టు మండలంలో చోటాముఖిపుట్టు, కించాయిపుట్టు ప్రాంతాల్లో లెక్కలేనన్ని గోతులు ఉన్నాయి. పాడేరు నుంచి ముంచంగిపుట్టు వరకు ప్రయాణానికి గతంలో గంట ఇరవై నిమిషాలు పట్టేది. కానీ ప్రస్తుతం గతుకుల రోడ్డుతో రెండు గంటలు పైడి సమయం పడుతోందని ప్రయాణికులు, డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఈ మార్గం అభివృద్ధి, మరమ్మతులకు కనీసం చర్యలు చేపట్టలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇద్దరు ఎమ్మెల్యేలు కనీసం పట్టించుకోని దుస్థితి

పాడేరు నుంచి ముంచంగిపుట్టు వరకు వున్న మెయిన్ రోడ్డు మరమ్మతులపై పాడేరు, అరకులోయ ఎమ్మెల్యేలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, చెట్టి ఫాల్గుణ కనీసం పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. పెదబయలుకు చెందిన ఎమ్మెల్యే ఫాల్గుణ తమ సొంత మార్గం అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టకపోవడంతో నియోజకవర్గంలోని ప్రజలు మండిపడుతున్నారు. అలాగే పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి అత్తవారి ఊరైన ముంచంగిపుట్టు మండలం ... మిగతా 8వ పేజీలో

పర్యాటకులకు ఊరట

అందుబాటులోకి వచ్చిన చెరువులవేనం వ్యూపాయింట్, మరుగుదొడ్లు



వ్యూపాయింట్ నుంచి బుధవారం మంచు మేఘాలను తిలకిస్తున్న పర్యాటకులు



చెరువులవేనంలో నిర్మించిన మరుగుదొడ్లు

చింతపల్లి, మార్చి 6: ఆంధ్ర కశ్మీర్ లంబసింగికి సమీపంలోని చెరువులవేనం పర్యాటక ప్రాంతంలో సందర్శకులకు వ్యూపాయింట్, మరుగుదొడ్లు ఎట్టకేలకు అందుబాటులోకి వచ్చాయి. దీంతో పర్యాటకుల ఇబ్బందులు తప్పాయి. ముగ్గురు ఐఏఎస్ అధికారుల కృషి ఫలితంగా అరకు ఎంపీ మాధవి నిధులతో వ్యూపాయింట్, మరుగుదొడ్ల నిర్మాణాలు జరిగాయి. ప్రతికూల పరిస్థితుల్లోనూ ఏడాదిన్నర కాలంగా ప్రత్యేక శ్రద్ధ తీసుకుని గిరిజన సంక్షేమశాఖ ఇంజనీరింగ్ అధికారులు పనులు పూర్తి చేశారు.

లంబసింగికి రెండున్నర కిలోమీటర్ల దూరంలో ఎత్తైన కొండపై చెరువులవేనం గ్రామం ఉం ది. ఈ గ్రామంలో శీతాకాలం మంచు అందాలు ప్రకృతి ప్రేమికులను అమితంగా ఆకట్టుకుంటున్నాయి. ఉదయం ఐదు గంటల నుంచి మధ్యాహ్నం పదకొండు, 12గంటల వరకు పెద్ద లోయలో ఆకాశం, నేలను ఏకం చేసినట్టుగా మంచు మేఘాలు పరుచుకుని ఉంటాయి. శ్వేత వర్ణంలో పచ్చని అడవులను తాకుతూ పయనిస్తున్న మంచు మేఘాలు అలరిస్తాయి. ఈ చెరువులవేనం ప్రకృతి అందాలను తొలిసారిగా ఐదేళ్ల కిందట 'ఆంధ్రజ్యోతి' బాహ్యప్రపంచానికి పరిచయం చేసింది. నాటి నుంచి నేటి వరకు వేల సంఖ్యలో పర్యాటకులు సీజన్‌లో చెరువులవేనం సందర్శిస్తున్నారు. కనీసం రహదారి సదుపాయం లేకపోయినప్పటికీ వృద్ధులు, చిన్నారులు సైతం చిన్నపాటి కాలిబాటలో ప్రయాణించి చెరువులవేనం చేరుకుని మంచు అందాలను ఆస్వాదిస్తున్నారు. చెరువులవేనం అతి తక్కువ కాలంలోనే మంచి గుర్తింపు పొందింది. చెరువులవేనంలో పర్యాటకులకు వ్యూపాయింట్, మరుగుదొడ్లు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ముగ్గురు ఐఏఎస్ అధికారులు ప్రత్యేక కృషి చేశారు. ప్రస్తుత విశాఖపట్నం కలెక్టర్ మల్లికార్జున, నాటి పీవో రోణంకి గోపాలక్రిష్ణ, ప్రస్తుత పీవో వి. అభిషేక్ కృషికితోడు ఎంపీ మాధవి నిధులు విడుదల చేయడంతో పనులు చురుగ్గా సాగాయి.

రహదారి నిర్మాణానికి చర్యలు



చెరువులవేనం గ్రామానికి రూ.80 లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో రహదారి నిర్మాణం చేపట్టనున్నాం. టెండర్ ప్రక్రియ పూర్తయింది. వారం, పది రోజుల్లో పనులు ప్రారంభిస్తాం. చెరువులవేనం ప్రాంతానికి పొరుగు దేశాల నుంచి సైతం పర్యాటకులు వస్తున్నారు. మల, మూత్ర విసర్జనకు చాలా ఇబ్బంది పడేవారు. ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొని ఎట్టకేలకు వ్యూపాయింట్, మరుగుదొడ్ల నిర్మాణం పూర్తి చేయగలిగాం.

-చాణిక్యరావు, డీఈఈ, గిరిజన సంక్షేమశాఖ, చింతపల్లి

చెరువులవేనం అభివృద్ధికి ప్రత్యేక కమిటీ

చెరువులవేనం అభివృద్ధికి స్థానిక నిరుద్యోగ యువతను భాగస్వాములను చేస్తూ కమిటీని ఐటీడీఏ పీవో అభిషేక్ ఏర్పాటు చేశారు. ప్రధానంగా చెరువులవేనంలో ప్లాస్టిక్‌ను నియంత్రించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు. చెరువులవేనం సందర్శించే సందర్శకుల నుంచి టికెట్ రూపంలో కొంత నగదు వసూలు చేసి, వచ్చిన ఆదాయం స్థానిక యువతకు జీతాలుగా, భవిష్యత్ అభివృద్ధి పనులకు ఖర్చుచేయాలని పీవో అభిషేక్ నిర్ణయించారు. వ్యూపాయింట్, మరుగుదొడ్ల నిర్మాణ బాధ్యతలను ఆ కమిటీకి పీవో అప్పగించారు. అలాగే పర్యాటకులకు అవసరమైన అల్పాహారం, టీ, స్నాక్స్, గిరిజన వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్స్ స్థానిక యువతతో ఏర్పాటు చేయిస్తున్నారు.

కలెక్టరేట్‌లో మహిళా దినోత్సవ సందడి

కేకు కట్ చేసిన విజయసునీత



కలెక్టరేట్‌లో కేకు కట్ చేస్తున్న విజయసునీత

కలెక్టరేట్‌లో బుధవారం రాత్రి మహిళా దినోత్సవ సందడి నెలకొంది. ఏపీ జేఏసీ మహిళా విభాగం ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో కలెక్టర్ విజయసునీత కేకును కట్ చేశారు. ఈ సందర్భంగా ఆమెకు, ఎస్‌సీడీసీ భవానీ, ఏవో అరుణకుమారిలకు శాలువాలు కప్పి సత్కరించారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా జేఏసీ ప్రతినిధులు పి.జగ్గయ్యమ్మ, ఎస్.శాంతికుమారి, జె.వెంకటలక్ష్మి, మహిళలు పాల్గొన్నారు.

-పాడేరు/ఆంధ్రజ్యోతి

రూ.54.4 కోట్లతో సింహగిరి అభివృద్ధి

- 'ప్రసాద్' పథకం కింద నిధులు మంజూరు
- నేడు వర్చువల్‌గా శంకుస్థాపన చేయనున్న ప్రధాని మోదీ

సింహాచలం, మార్చి 6: కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా ఆధ్యాత్మిక కేంద్రాల అభివృద్ధికి 'ప్రసాద్' (పిలిగ్రిమేజ్ రిజోవినేషన్ అండ్ స్పిరిట్యువల్ ఆగ్మెంటేషన్ డ్రైవ్) అనే పథకానికి రూపకల్పన చేసింది. అందులో భాగంగానే సింహాచలం వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం పరిధిలో రూ.54.4 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టేందుకు రాష్ట్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో 2022 సెప్టెంబరులో డీటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టు (డీపీఆర్) సమర్పించగా ఆమోదం తెలిపింది. నాటి నుంచి అనేక చర్చోపచర్చల తరువాత ఎట్టకేలకు గురువారం మధ్యాహ్నం 11.45 గంటలకు శ్రీనగర్ నుంచి ప్రధాని నరేంద్రమోదీ వర్చువల్ విధానంలో దేశవ్యాప్తంగా 'ప్రసాద్' పనులకు లాంఛనంగా శంకుస్థాపన చేయనున్నారు.

డీపీఆర్ ప్రకారం 'ప్రసాద్' పథకం కింద భక్తులకు వసతి కల్పన, క్యూల నిర్మాణం చేపట్టనున్నారు. కొండ దిగువన నాలుగు దశాబ్దాల క్రితం నిర్మించిన పుష్కరిణీ సత్రం స్థానంలో రూ.4.78 కోట్ల వ్యయంతో వసతి కేంద్రాలను నిర్మించనున్నారు. రెండో ఘాట్‌రోడ్డు వద్ద సుమారు నాలుగు ఎకరాల విస్తీర్ణంలో రూ.5.4 కోట్ల వ్యయంతో కనీస వసతుల యాత్రిక్ సదన్, పాత ఘాట్‌రోడ్డు ప్రవేశం వద్ద సుమారు రూ.3.54 కోట్లతో వ్యూపాయింట్లు, కొండపై దేవాలయానికి సంబంధించి విశేషాల ప్రదర్శన, మెట్లమార్గం ఆధునికీకరణ వంటి పనులు చేపట్టనున్నారు. అదేవిధంగా సుమారు రూ.7.7 కోట్లతో వంటశాల యాంత్రీకరణ, తాగునీటి కేంద్రాలు, గంగధార వద్ద దుస్తులు మార్చుకునేందుకు గదులు, 500 మంది కూర్చునేందుకు వీలుగా యాంఫీ థియేటర్, ఎలక్ట్రికల్ చార్జింగ్ కేంద్రాల ఏర్పాటు చేయనున్నారు. రూ.3.46 కోట్లతో పర్యాటక సమాచార కేంద్రం విత్ ఫుడ్ కౌంటర్, సోలార్ పవర్ ప్లాంట్, రూ.11.68 కోట్లతో దర్శన్ వెయిటింగ్ హాల్, హిల్‌టాప్ రోడ్డులో టీవీ టవర్ సమీపాన సుమారు రూ.4 కోట్లతో మల్టీపర్పస్ జీ+1 హాల్స్, రూ.5.62 కోట్లతో పక్కా మల్టీలెవెల్ షాపింగ్ కాంప్లెక్స్, రూ.81 లక్షలతో కూరగాయల నిల్వకు కోల్డ్ స్టోరేజీ, 14 సీట్ల ఎలక్ట్రిక్ బస్సులు ఆరు, లగేజీ స్కానింగ్ సిస్టమ్, సెక్యూరిటీకి కావలసిన మెటల్ డోర్ ఫ్రేమ్స్, డిటెక్టర్లు, తదితర పలు పనులను చేపట్టనున్నారు.

ఆశ్రమ విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

- ఐటీడీఏ పీవో అభిషేక్ ఆదేశం
- బంధవీధి బాలికల ఆశ్రమ పాఠశాల ఆకస్మిక తనిఖీ
- అనారోగ్యంతో ఉన్న విద్యార్థినులు ఆస్పత్రికి తరలింపు



విద్యార్థినులను ఆటోలో ఆస్పత్రికి తరలిస్తున్న పీవో అభిషేక్

జి.మాడుగుల, మార్చి 6: ఆశ్రమ పాఠశాలల విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఐటీడీఏ పీవో వి.అభిషేక్ ఆదేశించారు. మండలంలోని కె.కోడాపల్లి పంచాయతీ బంధవీధి బాలికల ఆశ్రమ పాఠశాలను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా సిక్‌రూమ్‌ను తనిఖీ చేశారు. ఇక్కడి ఐదుగురు విద్యార్థినులు అనారోగ్యంతో ఉన్నట్టు గుర్తించారు. వారిని స్వయంగా ఆటోలో స్థానిక సీహెచ్‌సీకి తరలించారు. అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ విద్యార్థులు అనారోగ్యానికి గురైనప్పుడు తల్లిదండ్రులు స్వగ్రామాలకు తీసుకువెళ్లడానికి ప్రయత్నిస్తే ఎట్టి పరిస్థితుల్లో పంపించవద్దని ఆదేశించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులకు వడ్డించారు. మెనూను పక్కాగా అమలు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. పీవో వెంట ఏటీడబ్ల్యూవో తిరుపాల్, పాఠశాల సిబ్బంది వున్నారు.

నేడు సీఎం జగన్ అనకాపల్లి రాక

వైఎస్సార్ చేయూత నిధుల విడుదల కార్యక్రమానికి హాజరు



అనకాపల్లి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి గురువారం అనకాపల్లి రానున్నారు. గన్నవరం నుంచి ప్రత్యేక విమానంలో బయలుదేరి ఉదయం 10.20 గంటలకు విశాఖపట్నం చేరుకుంటారు. అక్కడ నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 10.45కు కశింకోట ఎంపీడీఓ కార్యాలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌కు చేరుకుంటారు. 10.50 గంటలకు బస్సులో బయలుదేరి పిసినికాడలో ఏర్పాటు చేసిన బహిరంగసభా వేదిక వద్దకు వస్తారు. కలెక్టరు రవి పట్టన్‌శెట్టి అధ్యక్షతన ఏర్పాటు చేసిన 'చేయూత' నిధుల విడుదల కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులను ఉద్దేశించి మాట్లాడతారు. అనంతరం బటన్ నొక్కి నిధులు విడుదల చేస్తారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి రెండు వరకు వైసీపీ నాయకులతో సమావేశమవుతారు. 2.10 గంటలకు హెలికాప్టర్‌లో విశాఖ విమానాశ్రయానికి బయలుదేరతారు. అక్కడి నుంచి 2.30 గంటలకు విమానంలో విజయవాడకు బయలుదేరతారు.

ఎన్నికల్లో నోడల్ అధికారుల పాత్ర కీలకం

నోడల్ అధికారుల సమావేశంలో కలెక్టర్ విజయసునీత



ఎన్నికలపై నోడల్ అధికారులతో సమావేశమైన విజయసునీత

పాడేరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల నిర్వహణలో నోడల్ అధికారుల పాత్ర ఎంతో కీలకమని కలెక్టర్ విజయసునీత అన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం రాత్రి నోడల్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలో రవాణా పరంగా అనేక సవాళ్లున్నాయని, వాటిని అధిగమించాలన్నారు. అన్ని శాఖలకు చెందిన అధికారులు నోడల్ అధికారులుగా వున్నారన్నారు. ఎన్నికల విధుల్లో ఎదురయ్యే పరిస్థితులను చాకచక్యంగా అధిగమిస్తూ ఎన్నికల విధుల్లో మరింత చొరవ, భాగస్వామ్యం కావాలన్నారు. ఎన్నికల కమిషన్ నుంచి ఎప్పటికప్పుడు వచ్చే సూచనలపై ఎన్నికల బృందాలకు అవగాహన కల్పించాలన్నారు. మేన్‌పవర్‌పై సంపూర్ణ అవగాహనతో డేటాను రూపొందించాలని, సక్రమంగా వినియోగించుకోవాలని, అవసరమైన శిక్షణలు ఇవ్వాలన్నారు. ఎన్నికల సామగ్రి పంపిణీ జరిగిన తరువాత నేరుగా పోలింగ్ కేంద్రానికి చేరాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ మధ్యలో ఆగకూడదన్నారు. నోడల్ అధికారులు తమ పాత్రను సమర్థవంతంగా నిర్వర్తించి ఎన్నికలను విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పి.అంబేడ్కర్, నోడల్ అధికారులు కె.అప్పారావు, లీలాప్రసాద్, కె.సునీల్‌కుమార్, వి.మురళి, పి.గోవిందరాజులు, సువర్ణఫణి, ఎస్‌బీఎస్.నంద్, రమేశ్‌కుమార్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

వ్యాన్ బోల్తా పడి బాలుడి మృతి



సంఘటనా స్థలంలో బాలుడి మృతదేహం

అరకులోయ, మార్చి 6: వ్యాన్ బోల్తా పడి ఓ బాలుడు మృతి చెందాడు. ఈ సంఘటన అనంతగిరి మండలం లంగుపర్తి గ్రామంలో బుధవారం సాయంత్రం చోటుచేసుకుంది. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. అనంతగిరి మండలం లంగుపర్తి గ్రామంలో ఏటా మహాశివరాత్రి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తారు. ఇందులో భాగంగా ఉత్సవ కమిటీ సభ్యులు ఎస్.కోట నుంచి డీజే సౌండ్ సెట్, స్టేజి, టెంట్ సామగ్రిని వ్యాన్‌లో లంగుపర్తికి తీసుకువచ్చారు. అయితే వేదిక సిద్ధం చేస్తున్న స్థలానికి చేరుకునే ప్రయత్నంలో వ్యాన్ అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో వ్యాన్ క్యాబిన్ వెనుక ట్రక్‌లో ఉన్న ఎస్.కోటకు చెందిన పవన్ కల్యాణ్(15) కింద పడిపోవడం, ఆ బాలుడిపై సామగ్రి పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. దీనిపై వ్యాన్ డ్రైవర్ అనంతగిరి పోలీస్‌స్టేషన్‌లో పిర్యాదు చేశాడు. ఎస్ఐ రాము కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాణాలతో దాడి చేసి వ్యక్తి హత్య?

ఏవోబీలో దారుణం



బాణాల దాడిలో మృతి చెందిన వ్యక్తి

జి.మాడుగుల, మార్చి 6: ఆంధ్ర, ఒడిశా సరిహద్దు ప్రాంతంలో బుధవారం దారుణం చోటుచేసుకుంది. ఒడిశాకు చెందిన ప్రాంతంలో ఓ వ్యక్తిని కొందరు బాణాలతో హతమార్చారు. జి.మాడుగుల మండలం కిల్లంకోట పంచాయతీకి సరిహద్దున ఉన్న ఒడిశా రాష్ట్రం మల్కన్‌గిరి జిల్లాకు చెందిన చిట్టంగరువు గ్రామంలో ఓ వర్గానికి చెందిన వ్యక్తులు మరో వర్గానికి చెందిన వ్యక్తిపై బాణాలతో దాడి చేసి హతమార్చినట్టు తెలిసింది. గ్రామంలో ఓ మహిళను నాటు తుపాకీతో గాయపరిచిన ఘటనలో వివాదం చెలరేగింది. ఆమె తరఫువారు ఆగ్రహంతో బాణాలతో దాడి చేసి ఎదుటి వర్గానికి చెందిన వ్యక్తిని హతమార్చినట్టు సమాచారం. అయితే సంఘటన జరిగింది ఒడిశాలో కావడంతో పూర్తి వివరాలు తెలియరాలేదు.

బీసీలకు టీడీపీ-జనసేన పెద్ద పీట

పది అంశాల డిక్లరేషన్‌పై సర్వత్రా హర్షం



పబ్లిక్ పల్స్

తెలుగుదేశం- జనసేన పార్టీలు మంగళవారం ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎదురుగా వున్న మైదానంలో నిర్వహించిన 'జయహో బీసీ' బహిరంగ సభలో ప్రకటించిన 'బీసీ డిక్లరేషన్'పై వెనుకబడిన వర్గాల వారు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. బీసీ డిక్లరేషన్‌లో పేర్కొన్న హామీలను అమలు చేస్తే ప్రతి ఒక్క కుటుంబానికి కనీసం ఒక్క ప్రయోజనం అయినా చేకూరుతుందని వివిధ కులాలు, విభిన్న వృత్తులకు చెందిన ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా 50 ఏళ్లకే పెన్షన్, సబ్‌ప్లాన్‌కు రూ.లక్షన్నర కోట్లు, ఆదరణ, చంద్రన్న బీమా, విదేశీ విద్యకు ఆర్థిక సాయం, పీజీ విద్యార్థులకు కూడా ఫీజు రీయింబర్స్‌మెంట్, పెళ్లి కానుక రూ.లక్షకు పెంపు వంటివి ఎంతో మేలు చేస్తాయని సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. తెలుగుదేశం- జనసేన పార్టీలు ప్రకటించిన 'బీసీ డిక్లరేషన్'పై ఎవరేమన్నారంటే...

బీసీల్లో అన్ని వర్గాలకు ప్రయోజనం



తెలుగుదేశం - జనసేన పార్టీలు 'జయహో బీసీ' బహిరంగ సభలో ప్రకటించిన 'బీసీ డిక్లరేషన్' ద్వారా అన్ని వర్గాల వారికి ప్రయోజనం కలుగుతుంది. 50 ఏళ్లకే పెన్షన్ మంజూరు చేయడంతో పాటు రూ.3 వేల నుంచి రూ.4 వేలకు పెంపు వల్ల ఆర్థిక ఆసరా లభిస్తుంది. స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్ అమలుతో బీసీలకు సముచిత ప్రాధాన్యం కల్పించినట్టు అవుతుంది. రూ.లక్షన్నర కోట్లతో బీసీలకు సబ్ ప్లాన్ అమలు చేస్తామని ప్రకటించడం మంచి నిర్ణయం. చంద్రన్న బీమా ప్రయోజనాన్ని రూ.10 లక్షలకు పెంచడం, చంద్రన్న పెళ్లి కానుక రూ.లక్షకు పెంచడం హర్షణీయం. మొత్తం మీద బీసీ డిక్లరేషన్‌లో పేర్కొన్న అంశాలు అమలైతే బీసీలు సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందుతారు.

- **ద్రాక్షారపు కామేశ్వరరావు**, బలిఘట్టం, నర్సీపట్నం

చంద్రన్న బీమా బీసీలకు వరం



తెలుగుదేశం- జనసేన పార్టీలు ఉమ్మడిగా ప్రకటించిన బీసీ డిక్లరేషన్ చాలా బాగుంది. ముఖ్యంగా రూ.పది లక్షలతో చంద్రన్న బీమా పథకం పునరుద్ధరణ.. పెద్ద దిక్కును కోల్పోయిన బీసీ కుటుంబాలకు వరంలాంటిది. .

- **ఈర్లె శ్రీనివాసరావు**, పాల సంఘం అధ్యక్షుడు, ఎడ్ల వీధి, చోడవరం

శాశ్వత కుల ధ్రువ పత్రాలతో ఎంతో ఉపయోగం



టీడీపీ- జనసేన ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌లో శాశ్వత కుల ధ్రువీకరణ పత్రాలు ఇస్తామనడం వల్ల ఎంతో ఉపయోగం ఉంది. విద్యార్థులు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పని ఉండదు. పీజీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, విదేశీ విద్య వంటి అంశాలు ఇందులో పొందుపరచడం శుభపరిణామం. టీడీపీ- జనసేన అధికారంలోకి వస్తే అన్ని వర్గాలకు మేలు జరుగుతుంది.

- **ధర్మిరెడ్డి సత్యనారాయణ**, రామన్నపాలెం, అచ్యుతాపురం మండలం

పెళ్లికానుకతో ఆర్థిక ఆసరా



తెలుగుదేశం- జనసేన కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే బీసీలకు పెళ్లికానుకను రూ.లక్షకు పెంచుతామని ప్రకటించడం చాలా ఆనందంగా ఉంది. సామాన్య కుటుంబాలకు నిజమైన కానుకగానే భావించాలి. ఆర్థిక స్తోమత లేని కుటుంబాలకు పెళ్లి కానుక రూపంలో ఇచ్చే లక్ష రూపాయలు ఎంతో ఆదుకుంటాయి.

- **బయలపూడి పైడిరత్నం**, పిల్లావారితోట, చోడవరం

బీసీల ఆర్థిక, సామాజిక అభివృద్ధికి దోహదం



తెలుగుదేశం పార్టీ, జనసేన కూటమి ప్రకటించిన బీసీ డిక్లరేషన్ బీసీలు ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి సాధించేందుకు దోహదం చేస్తుంది. బీసీలకు 50 ఏళ్లకే నాలుగు వేల రూపాయల పెన్షన్ ఇవ్వడం వల్ల ఆర్థికంగా ఇబ్బందులు పడే ఎంతోమందికి ఆసరా లభిస్తుంది. బీసీ రక్షణకు ప్రత్యేక చట్టాన్ని చేయాలనుకోవడం గొప్ప విషయం. సబ్ ప్లాన్‌కు లక్షన్నర కోట్ల రూపాయలు కేటాయింపు అంటే గతంలో ఎన్నడూ లేని విధంగా బీసీల సమగ్ర ఆర్థిక అభివృద్ధికి బాటలు పడే అవకాశముంటుంది. ప్రోత్సాహకాల పునరుద్ధరణ వల్ల స్వయం ఉపాధి మార్గాల బాట పట్టేందుకు బీసీ యువతకు అవకాశం ఏర్పడుతుంది.

- **వి.సంగంనాయుడు**, విశాఖపట్నం

బీసీలను ఆర్థికంగా ఆదుకున్నట్టే..



బీసీలకు 50 ఏళ్లకే పింఛన్ ఇస్తామని టీడీపీ- జనసేన బీసీ డిక్లరేషన్‌లో ప్రకటించడం వల్ల బీసీలను ఆర్థికంగా ఆదుకున్నట్టు అవుతుంది. పేదలకు రూ.4 వేల పింఛన్ వస్తే వారికి ఎంతో భరోసా ఉంటుంది. ఇది బీసీలకు ఎంతో ఊరటనిస్తుంది.

- **బొద్దపు నాయుడు**, పెదపల్లి, ఎలమంచిలి మునిసిపాలిటీ

బీసీలకు భరోసా



తెలుగుదేశం- జనసేన పార్టీలు ప్రకటించిన బీసీ డిక్లరేషన్ అమలైతే అన్ని వర్గాల వారికి ప్రయోజనం చేకూరుతుంది. చేతివృత్తులపై ఆధారపడిన వారికి 'ఆదరణ' పథకం ఎంతో దోహదపడుతుంది. బీసీల రక్షణకు ప్రత్యేక చట్టాన్ని తీసుకువస్తామని ప్రకటించడం ఆనందంగా ఉంది. బీసీలకు 50 ఏళ్లకే పింఛన్ మంజూరు, పెన్షన్‌ను రూ.3 వేల నుంచి రూ.4 వేలకు పెంపు వంటివి ఆర్థిక భరోసా కల్పిస్తాయి.

మునాసుల నాగేశ్వరరావు, పొంగలిపాక, మాడుగుల మండలం

విద్యకు పెద్దపీట వేయడం శుభపరిణామం



టీడీపీ- జనసేన ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌లో విద్యకు పెద్దపీట వేశారు. షరతులు లేకుండా విదేశీ విద్య పథకం అమలు చేస్తామని ప్రకటించడం నాలాంటి విద్యార్థినులకు ఎంతో మేలు. పీజీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ పునరుద్ధరిస్తామని, విద్యోన్నత పథకాలు పునఃప్రారంభిస్తామని ప్రకటించడం శుభపరిణామం.

- **మేడిశెట్టి అశ్లేష**, విద్యార్థిని, బొద్దపువానిపాలెం, పరవాడ మండలం

మాకు మేలు జరుగుతుందనే నమ్మకం ఉంది



నాకు 55 ఏళ్లు. కాళ్లు, చేతులు సరిగా పనిచేయక పనిలోకి వెళ్లలేకపోతున్నాను. కూలి పనులు చేయలేకపోతున్నాను. టీడీపీ- జనసేన అధికారంలోకి వస్తే బీసీలకు 50 ఏళ్లకే పింఛన్ ఇస్తామని ప్రకటించడం ఎంతో ఆనందాన్ని కలిగించింది. కచ్చితంగా మాకు మేలు జరుగుతుందనే నమ్మకం కలిగింది.

- **ఇసరపు రాజులు**, నామవరం, పాయకరావుపేట మండలం

బీసీల ఉన్నతికి దోహదం



టీడీపీ- జనసేన కూటమి ప్రకటించిన బీసీ డిక్లరేషన్ బీసీల అభ్యున్నతికి ఎంతో మేలు కలిగించేలా ఉంది. బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టంతో పాటు సబ్ ప్లాన్‌కు ఐదేళ్లలో రూ.లక్షన్నర కోట్లు కేటాయిస్తామని ప్రకటించడం శుభసూచికం. స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని చెప్పడం, చంద్రన్న బీమా రూ.10 లక్షలతో పునరుద్ధరిస్తామని వెల్లడించడం శుభపరిణామం.

- **కరణం అప్పారావు**, దేశపాత్రునిపాలెం, పరవాడ మండలం

50 ఏళ్లకే పింఛన్‌తో ఎంతో మేలు



టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కల్యాణ్ సంయుక్తంగా ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌లో బీసీలకు 50 ఏళ్లకే పింఛన్ ఇస్తామని వెల్లడించడం వల్ల ఎంతో మేలు జరుగుతుంది. బీసీల్లో చాలా మంది ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపోవడంతో నెలంతా కష్టపడినా వచ్చే ఆదాయం సరిపోక అర్ధాకలితో అలమటిస్తున్నారు. పింఛన్‌పై ప్రకటన చేసిన చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లకు బీసీ సంఘాల తరఫున ధన్యవాదాలు తెలుపుతున్నాం.

- **కె.జేజిబాబు**, కోటవీధి, అనకాపల్లి

బీసీల రక్షణకు ప్రత్యేక చట్టం ఎంతో అవసరం



బీసీ డిక్లరేషన్‌లో చంద్రబాబునాయుడు, పవన్ కల్యాణ్‌లు బీసీల రక్షణకు ప్రత్యేక చట్టం తీసుకువస్తామని చేసిన ప్రకటన ఆహ్వానించదగ్గ పరిణామం. చంద్రన్న ఆరోగ్య బీమా, బీసీలకు చట్టబద్ధమైన కులగణన, ఉపాధి ప్రోత్సాహం, బీసీల వివాహాలకు రూ.లక్ష కానుక వంటి అంశాలు బీసీలకు ఎంతో మేలు చేస్తాయి. టీడీపీ- జనసేన ప్రభుత్వం వస్తే బీసీలకు న్యాయం జరుగుతుందన్న నమ్మకం ఉంది.

- **ఏవీ నూకేశ్వరరావు**, షుగర్స్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, అనకాపల్లి

శాశ్వత కుల ధ్రువీకరణ పత్రాలు హర్షణీయం



తెలుగుదేశం- జనసేన అధికారంలోకి వస్తే శాశ్వత కుల ధ్రువీకరణ పత్రాలు ఇస్తామని ప్రకటించడం హర్షణీయం. ఏటేటా ధ్రువీకరణ పత్రాల కోసం రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరిగే ఇబ్బంది తొలగిపోతుంది. అలాగే పీజీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ కల్పించడం వల్ల బడుగు, బలహీనవర్గాల వారికి ఉన్నత చదువులకు అవకాశం ఉంటుంది. విదేశీ విద్యకు కూడా సహకారం అందించే విధంగా డిక్లరేషన్‌లో పొందుపరచడం విద్యార్థులకు శుభపరిణామం.

- **ఎ.లలిత**, డిగ్రీ విద్యార్థిని, అనకాపల్లి

పేద కుటుంబాలకు దన్ను



టీడీపీ- జనసేన సంయుక్తంగా ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌లో భాగంగా 50 ఏళ్లు నిండిన బీసీలందరికీ పింఛన్ ఇస్తామని ప్రకటించడం హర్షణీయం. అనేక మంది చేతివృత్తుల వారు 50 ఏళ్లలోపే అనేక వ్యాధుల బారిన పడుతున్నారు. ఇటువంటి తరుణంలో వారికి ఈ పింఛన్ల ప్రకటన ఎంతో దన్నుగా ఉంటుంది.

- **మత్తుర్తి మన్నియాచారి**, నక్కపల్లి

క్రైం... crime news

రైవాడ జలాశయంలో మునిగి వ్యక్తి మృతి



దీవి సత్తిబాబు(ఫైల్)

దేవరాపల్లి, మార్చి 6: దేవరాపల్లికి చెందిన దీవి సత్తిబాబు (48) రైవాడ జలాశయంలో ప్రమాదవశాత్తూ కాలుజారిపడి నీటిలో మునిగి మృతి చెందాడు. కాలకృత్యాలు తీర్చుకోవడానికి జలాశయం వద్దకు వెళ్లినప్పుడు ఈ సంఘటన జరిగిందని కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడి భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సీఎం జగన్ హామీలు నీటిమూటలు

» టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు



మాట్లాడుతున్న బుద్ద నాగజగదీశ్వరరావు

తుమ్మపాల, మార్చి 6 : ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి జిల్లాకు ఇచ్చిన హామీలన్నీ నీటిమూటలేనని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు ఆరోపించారు. బుధవారం పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చెరకు రైతులకు గిట్టుబాటు ధర ఇస్తామని, మూతపడిన తుమ్మపాల ఫ్యాక్టరీని తెరిపిస్తామని నాడు హామీ ఇచ్చారని, తీరా అధికారంలోకి వచ్చిన తరువాత తాండవ, ఏటికొప్పాక ఫ్యాక్టరీలను కూడా మూసేశారన్నారు. టీడీపీ హయాంలో మంజూరు చేసిన ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాలను పులివెందులకు తరలించుకుపోయారని అన్నారు. సొంత నియోజకవర్గంలో రైతుల ప్రయోజనాలను కాపాడలేని అసమర్థ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అని ధ్వజమెత్తారు. ఎన్టీఆర్ జిల్లా ఆస్పత్రిని రూ.68 కోట్లతో కేజీహెచ్ తరహాలో సదుపాయాలు కల్పిస్తామని మాయమాటలు చెప్పి మోసం చేశారన్నారు. శారదా నదిపై గ్రోయిన్ల మరమ్మతులకు రూపాయి కూడా విదిలించలేని ఘనత వైసీపీదేనన్నారు. ముఖ్యమంత్రి జగన్‌రెడ్డికి ఏ ముఖం పెట్టుకుని ఇక్కడ పర్యటనకు వస్తున్నారని ఆయన ప్రశ్నించారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు డాక్టర్ కేకేవీపీ నారాయణరావు, కోట్ని రామకృష్ణ, మళ్ల గణేశ్, పూడి త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

'వైసీపీ హయాంలో బీసీలకు తీవ్ర అన్యాయం'

కశింకోట, మార్చి 6: వైసీపీ హయాంలో బీసీలకు తీవ్ర అన్యాయం జరిగిందని ఉత్తరాంధ్ర బీసీ సంక్షేమ సంఘం మహిళా అధ్యక్షురాలు పెదపాటి కల్యాణి ఆరోపించారు. బుధవారం కశింకోటలో విలేకరులతో మాట్లాడుతూ, తెలుగుదేశం హయాంలో స్థానిక సంస్థల పదవుల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ కల్పించగా, వైసీపీ ప్రభుత్వం 24 శాతానికి తగ్గించిందన్నారు. బీసీలకు పూర్వ వైభవం రావాలంటే టీడీపీ-జనసేన కూటమిని గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

సీనియర్ ఉమెన్ హాకీ పోటీలకు జిల్లా జట్టు ఎంపిక



హాకీ సీనియర్ ఉమెన్ జిల్లా జట్టు క్రీడాకారిణులు

ఎలమంచిలి, మార్చి 6: ఒంగోలులో ఈ నెల 8వ తేదీ నుంచి జరగనున్న అంతర్ జిల్లాల సీనియర్ ఉమెన్ హాకీ టోర్నీకి జిల్లా జట్టు ఎంపిక ప్రక్రియ పూర్తయిందని హాకీ అసోసియేషన్ జిల్లా సెక్రటరీ కొఠారు నరేశ్ తెలిపారు. ఈ పోటీలకు 16 మంది సభ్యులతో కూడిన జట్టును ఎంపిక చేశామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు నరసింగరావు, ఏబీఎల్ రాజు, రాంబాబు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	112.00
లైవ్ ధర	132.00
విత్ స్కిన్	234.00
స్కిన్ లెస్	244.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	500
విజయనగరం	504
శ్రీకాకుళం	504

టీడీపీ-జనసేన ప్రభుత్వంతోనే రాష్ట్రం అభివృద్ధి

» మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు

» సూపర్-6, బీసీ డిక్లరేషన్‌పై విస్తృత ప్రచారం చేయాలని కేడర్‌కే పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీమంత్రి అయ్యన్నపాత్రుడు

మాకవరపాలెం, మార్చి 6: రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే టీడీపీ-జనసేన కూటమి అధికారంలోకి రావాల్సిన అవసరం ఎంతైనా వుందని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. మండలంలోని లచ్చన్నపాలెంలో బుధవారం ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. తొలుత టీడీపీ శ్రేణులు, మహిళలు ఆయనకు ఘనస్వాగతం పలికి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఇవే తనకు చివరి ఎన్నికలని, అందువల్ల ప్రతి ఒక్కరూ ఆశీర్వదించి గెలిపించాలని కోరారు. టీడీపీ హయాంలో లచ్చన్నపాలెంలో రూ.2 కోట్లతో అభివృద్ధి పనులు చేశామని, రూ..10 కోట్లతో సర్పా నదిలో భారీ తాగునీటి పథకం ఏర్పాటు చేసి 12 గ్రామాలకు తాగునీరు అందిస్తున్నామని తెలిపారు. టీడీపీ-జనసేన ప్రభుత్వం ఏర్పడిన వెంటనే సూపర్ సిక్స్ హామీలు, బీసీ డిక్లరేషన్‌లో పేర్కొన్న అంశాలను అమలు చేస్తామని చెప్పారు. టీడీపీ కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి వైసీపీ పాలనలో పెరిగిన ధరలు, చార్జీలు, పన్నుల పెంపు వల్ల ఎంతెంత భారం పడుతున్నదో ప్రజలకు చెప్పాలని, వచ్చే ఎన్నికల్లో టీడీపీ-జనసేన కూటమిని గెలిపిస్తే ఏయే ప్రయోజనాలు కలుగుతాయో వివరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు చింతకాయల విజయ్, రాజేశ్, ఆర్వై పాత్రుడు, అల్లు రామునాయుడు, రుత్తల శేషుకుమార్, పోతల అప్పలనాయుడు, పోతల రాంబాబు, జోగిపాత్రుడు, తదితరులు పాల్గొన్నారు.

షుగర్ ఫ్యాక్టరీలను తెరిపించాలి

» సీఎంకు సీపీఎం జిల్లా కార్యదర్శి లోకనాథం లేఖ

అనకాపల్లి టౌన్, మార్చి 6: జిల్లాలో మూతపడిన తుమ్మపాల, తాండవ, ఏటికొప్పాక షుగర్ ఫ్యాక్టరీలను ఆధునికీకరించి తెరిపించాలని ముఖ్యమంత్రికి సీపీఎం జిల్లా కార్యదర్శి లోకనాథం లేఖ రాశారు. రైతులు పండించే పంటలకు, బెల్లం రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. అచ్యుతాపురం, పరవాడ పరిశ్రమల్లో స్థానికులకు 75 శాతం ఉద్యోగాలు ఇవ్వాలని ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ చేసినప్పటికీ అమలు చేయడం లేదని, నోటిఫికేషన్ అమలయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాంబిల్లిలోని ఎన్ఏఓబీ నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. విశాఖ - చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ నిర్వాసితులకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం ప్యాకేజి చెల్లించాలని, జిరాయితీ భూములతో సమానంగా డీ ఫారం, సాగుదారులకు నష్టపరిహారం చెల్లించాలని కోరారు. జిల్లాలో అస్తవ్యస్తంగా ఉన్న రహదారుల అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరారు.

సీఎం పర్యటనతో హైవే బంద్

అనకాపల్లి రూరల్, మార్చి 6: ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి గురువారం అనకాపల్లి జిల్లా పర్యటన సందర్భంగా ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా భారీ వాహనాలను దారి మళ్లిస్తున్నట్టు ఎస్పీ కేవీ మురళీకృష్ణ తెలిపారు. చేయూత పథకం నిధులు విడుదల చేసేందుకు పిసినికాడలో ఏర్పాటు చేసిన బహిరంగ సభకు ప్రజలు పెద్ద ఎత్తున హాజరయ్యే అవకాశం ఉన్నందున ఉదయం తొమ్మిదిన్నర గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తున్నట్టు పేర్కొన్నారు. విశాఖ నుంచి అనకాపల్లి మీదుగా తుని వైపు వెళ్లే వాహనాలు లంకెలపాలెం జంక్షన్ నుంచి పరవాడ, అచ్యుతాపురం, ఎలమంచిలి, రేగుపాలెం జంక్షన్ మీదుగా వెళ్లాలన్నారు. అదే విధంగా తుని నుంచి అనకాపల్లి మీదుగా విశాఖ వైపు వెళ్లే భారీ వాహనాలు రేగుపాలెం జంక్షన్ వద్ద నుంచి ఎలమంచిలి, అచ్యుతాపురం, పరవాడ మీదుగా లంకెలపాలెం జంక్షన్‌కు చేరుకోవాలన్నారు. శ్రీకాకుళం వైపు నుంచి ఆనందపురం- అనకాపల్లి నాలుగు వరుసల జాతీయ రహదారి మీదుగా వచ్చే వాహనాలు సబ్బవరం వద్ద సర్వీసు రోడ్డులోకి మారి, అసకపల్లి, లంకెలపాలెం జంక్షన్, పరవాడ, అచ్యుతాపురం ఎలమంచిలి మీదుగా రేగుపాలెం జంక్షన్ వద్ద జాతీయ రహదారిపైకి చేరుకుని తుని వైపు వెళ్లవచ్చనన్నారు. చోడవరం నుంచి తుని వైపు వెళ్లే వాహనాలు అనకాపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్ రోడ్డు, మునగపాక, అచ్యుతాపురం జంక్షన్, ఎలమంచిలి మీదుగా రేగుపాలెం జంక్షన్ వద్ద జాతీయ రహదారిపైకి చేరుకుని తుని వెళ్లాలన్నారు.

28,247 మంది రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ



నమూనా చెక్కు విడుదల చేస్తున్న దృశ్యం

అనకాపల్లి కలెక్టరేట్, మార్చి 6: జిల్లాలో మిచౌంగ్ తుఫాన్ వల్ల పంట నష్టపోయిన 28,247 మంది రైతులకు రూ.11 కోట్ల 29 లక్షల 88 వేలు ఇన్‌పుట్ సబ్సిడీగా అందించినట్టు ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ తెలిపారు. బుధవారం కలెక్టరేట్ సమావేశమందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన డీఆర్వో బి.దయానిధి, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావులతో కలిసి రైతులకు నమూనా చెక్కును అందజేశారు. అంతకు ముందు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సబ్సిడీ విడుదల కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారాన్ని కలెక్టరేట్ నుంచి వీరంతా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తిలకించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారులు, రైతులు పాల్గొన్నారు.

విధులకు గైర్హాజరైన సచివాలయాల ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు

మాకవరపాలెం, మార్చి 6: విధులకు గైర్హాజరైన మాకవరపాలెం, తామరం సచివాలయాల సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేశామని ఎంపీడీవో జి.సుందరరావు తెలిపారు. ఆయన బుధవారం ఉదయం ఈ సచివాలయాలను తనిఖీ చేసి హాజరు పట్టికను పరిశీలించారు. మాకవరపాలెంలో ఐదుగురు సిబ్బందికి గాను ఇద్దరు విధులకు హాజరుకాలేదు. తామరంలో ఐదుగురు సిబ్బందికి ముగ్గురు విధులకు హాజరు కాలేదు. దీంతో ఈ ఐదుగురికి షోకాజ్ నోటీసులు జారీచేస్తున్నట్టు చెప్పారు.

ఉత్తరాంధ్ర సమస్యలపై సమాధానం చెప్పాలి

» ముఖ్యమంత్రికి కొణతాల రామకృష్ణ బహిరంగ లేఖ

కొత్తూరు, మార్చి 6 : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉత్తరాంధ్ర సమస్యలపై సమాధానం చెప్పాలని మాజీ మంత్రి, అనకాపల్లి అసెంబ్లీ జనసేన - టీడీపీ ఉమ్మడి అభ్యర్థి కొణతాల రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక బహిరంగ లేఖ రాశారు. అనకాపల్లి జిల్లాకు వస్తున్న ముఖ్యమంత్రికి స్వాగతం సుస్వాగతం అంటూనే పవన్‌కల్యాణ్, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును దూషించడానికి సమయం కేటాయిస్తారా?, లేక అనకాపల్లి జిల్లాతో పాటు ఉత్తరాంధ్ర ప్రజల తరఫున అడుగుతున్న ప్రశ్నలకు సమాధానం చెబుతారో చెప్పాలని కోరారు. జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని చెప్పి ఈ విషయాన్ని ఎందుకు మర్చిపోయారని ప్రశ్నించారు. 2019 జూన్ 1 నాటికి ఖాళీల భర్తీకి ఇచ్చిన నోటిఫికేషన్ విడుదల తరువాత ఎన్ని భర్తీ చేశారో చెప్పాలన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే మెగా డీఎస్సీ వేస్తామని చెప్పిన మాట వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. ఎన్నికల ముందు దగా డీఎస్సీ వేసి విద్యావంతులైన యువత జీవితాలతో చెలగాటం ఆడుతుండడం నిజమా కాదా? అని నిలదీశారు. ప్రభుత్వ ఉద్యోగులకు 1వ తేదీన జీతాలు ఇస్తామని చెప్పిన హామీ ఏమైందన్నారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతికి ఎన్ని నిధులు కేటాయించారో చెప్పాలని నిలదీశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరించకుండా తీసుకున్న చర్యలు ఏమిటని ప్రశ్నించారు. సాగునీటి ప్రాజెక్టులకు ఐదేళ్లలో ఎంత బడ్జెట్ కేటాయించారని?, అందులో ఎంత ఖర్చు చేశారని ప్రశ్నించారు. వెనుకబడిన ఉత్తరాంధ్రకు కేంద్రం ఎన్ని నిధులు కేటాయించిందో?, ఆ నిధులు ఏమయ్యాయో ప్రజలకు వివరించాలన్నారు. ఉత్తరాంధ్ర పెండింగ్ ప్రాజెక్టులపై ఎన్నిసార్లు సమీక్ష జరిపారు?, వలసలు అరికట్టడానికి తీసుకున్న చర్యలు ఏమిటని ప్రశ్నించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాలకు చెందిన నిధులను దారి మళ్లించిన మాట వాస్తవమా? కాదా? చెప్పాలన్నారు. వైసీపీ అధికారం చేపట్టిన తరువాత ఎన్ని కంపెనీలు వచ్చాయో ప్రజలకు చెప్పాలన్నారు. బస్సు చార్జీలు, కరెంటు చార్జీలు, ఇంటి పన్ను, చెత్త పన్ను, రిజిస్ట్రేషన్ చార్జీలు ఎన్నిసార్లు పెంచారో వివరించాలని డిమాండ్ చేశారు. నిత్యావసర వస్తువుల ధరలను అదుపు చేయడంలో తీసుకున్న చర్యలు ఏమిటో బహిరంగంగా ప్రజలకు వివరించాలన్నారు. వీటన్నింటిపై సభలో ప్రజలందరికీ వివరించాలని ఆయన డిమాండ్ చేశారు.

ఇంటర్ పరీక్షకు 15,258 మంది విద్యార్థులు హాజరు

అనకాపల్లి టౌన్, మార్చి 6: అనకాపల్లి జిల్లాలో బుధవారం జరిగిన ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం మేథ్స్, బొటనీ, సివిక్స్ పరీక్షకు 15,258 మంది హాజరయ్యారని ఇంటర్మీడియట్ బోర్డు జిల్లా అధికారి సుజాత తెలిపారు. ఈ పరీక్షకు 15,856 మంది హాజరుకావాల్సి ఉండగా 15,258 మంది హాజరయ్యారని తెలిపారు. 598 మంది హాజరుకాలేదన్నారు. జనరల్ విద్యార్థులు 12,984కి 12,562 మంది హాజరయ్యారన్నారు. ఒకేషనల్ విద్యార్థులు 2872కి 2696 మంది హాజరయ్యారని తెలిపారు.



విద్యార్థుల మధ్య కూర్చొని ఓటు హక్కుపై కల్పిస్తున్న శ్రావణ్‌కుమార్

సుపరిపాలన అందించే నేతలను ఎన్నుకోండి

» టీడీపీ అరకు పార్లమెంట్ నియోకవర్గ ఇన్‌చార్జి శ్రావణ్‌కుమార్

అరకులోయ, మార్చి 6: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఓ ఆయుధమని, ప్రతీ ఐదేళ్లకోసారి వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో సుపరిపాలన అందించే నాయకులను ఎన్నుకోవాలని టీడీపీ అరకు పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి కిడారి శ్రావణ్‌కుమార్ సూచించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పార్టీ మండల అధ్యక్షుడు శెట్టి బాబూరావు ఆధ్వర్యంలో నూతన ఓటర్లతో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. విలువైన ఓటును వృథా చేయకుండా మంచి నేతలకు వేయాలన్నారు. విజనరీ కలిగిన, అన్ని వర్గాల ప్రజల మేలు కోరే నాయకులను ఎన్నుకుని ఓటును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మంచి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకునే సదావకాశం ఓటు ద్వారానే లభిస్తుందని, ఇందులో యువత పాత్ర కీలకమని చెప్పారు. అందువల్ల యువ ఓటర్లు ఎన్నికల సమయంలో పోలింగ్ బూత్‌కు వెళ్లి బాధ్యతగా తమ ఓటు హక్కును వినియోగించుకుని మంచి పాలనను అందించే నాయకత్వానికి మద్దతు పలకాలని ఆయన కోరారు. ఈదఫా జరగనున్న ఎన్నికల్లో టీడీపీ-జనసేన కూటమికి ఓటు వేయాలని, అందరికీ మంచి భవిష్యత్తు ఇచ్చే చంద్రబాబు-పవన్ కల్యాణ్‌కు మద్దతు పలకాలని శ్రావణ్ సూచించారు.

గిరిజన ప్రాంత అభివృద్ధి టీడీపీతోనే సాధ్యం

పార్టీ అరకు అసెంబ్లీ నియోజకవర్గం ఇన్‌చార్జి సియ్యారి దొన్నుదొర



బోంద్రుగూడలో బాబు ష్యూరిటీ కరపత్రాలు ప్రదర్శిస్తున్న దొన్నుదొర, నేతలు

ముంచంగిపుట్టు, మార్చి 6: తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తేనే గిరిజన ప్రాంతం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందని పార్టీ అరకు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి సియ్యారి దొన్నుదొర అన్నారు. మండలంలోని జోలాపుట్టు పంచాయతీ బోంద్రుగూడ గ్రామంలోబుధవారం బాబు ష్యూరిటీ- భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అలాగే టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే చేపట్టే పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, నూతన పథకాలను ప్రజలకు వివరించారు. ఇతర పార్టీల నుంచి వచ్చిన సుమారు 100 మందికి పార్టీ కండువాలను వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా దొన్నుదొర మాట్లాడుతూ ఏ గ్రామాన్ని సందర్శించినా సమస్యలు దర్శనమిస్తున్నాయని, తమ ప్రభుత్వం రాగానే మౌలిక సదుపాయాల కల్పనకు మొదటి ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో తనను ప్రజలు ఆశీర్వదించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పార్టీ ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి గడ్డంగి రామ్మూర్తి, మండల అధ్యక్షుడు కె.బలరాం, మండల ప్రధాన కార్యదర్శి జగత్‌రాయ్, ఉపాధ్యక్షుడు ఎస్.బాబూజీ, సర్పంచులు వి.లక్ష్మణ్, ధనియా, మాజీ సర్పంచ్ వి.రామస్వామి, కార్యదర్శి ఎన్.శంకరావు, అరకు పార్లమెంట్ కార్యదర్శి కామేశ్వరరావు, మహిళా ఉపాధ్యక్షురాలు కె.కాసులమ్మ తదితరులు పాల్గొన్నారు.

మినుములూరులో ఘనంగా మహిళా దినోత్సవం



కార్యక్రమంలో మాట్లాడుతున్న మహిళా పారిశ్రామికవేత్త లలిత

పాడేరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలో మినుములూరులో చైతన్య స్రవంతి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బుధవారం ముందస్తు మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సంస్థ డైరెక్టర్ మాలిని ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మైదాన ప్రాంతానికి చెందిన గార్మెంట్స్ మహిళా పారిశ్రామిక వేత్త కె.లలిత మాట్లాడారు. మహిళల ఆర్థికాభివృద్ధికి గార్మెంట్స్ పరిశ్రమ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. మహిళలు స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా మహిళల హక్కులు, చట్టాలు, మహిళా దినోత్సవ ప్రత్యేకతను మహిళలకు వివరించారు. ఈ కార్యక్రమంలో అరణ్యక సంస్థ డైరెక్టర్ రాజ్‌కుమార్, అర్క్ సంస్థ వ్యవస్థాపకుడు డి.ప్రసాద్, రైతు ఉత్పత్తి దారుల సంఘాల డైరెక్టర్లు, సభ్యులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన సంఘం భవనానికి ప్రారంభోత్సవం



గిరిజన భవనాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ మాధవి

కొయ్యూరు, మార్చి 6: మండల కేంద్రంలో నిర్మించిన గిరిజన సంఘం భవనాన్ని ఎంపీ గొడ్డేటి మాధవి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆమె మాట్లాడుతూ తన కోటా నిధులు రూ.25 లక్షలతో నిర్మించిన భవనాన్ని తన చేతుల మీదుగానే ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. గిరిజనుల అవసరాలకు ఈ భవనం మరింత ఉపయోగకరంగా ఉండేలా తీర్చిదిద్దాలనే ఆకాంక్ష ఉన్నా, అందుకు తగిన అవకాశం తిరిగి లభించాలని కోరారు. జడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర మాట్లాడుతూ పెందుర్తి, వేపగుంట ప్రాంతాలలో గిరిజనులు అధిక శాతం ఉన్నారని, ఆయా ప్రాంతాల్లో గిరిజన భవనాల నిర్మాణాలకు నిధులు కేటాయిస్తానని చెప్పారు. జీసీసీ చైర్‌పర్సన్ స్వాతిరాణి మాట్లాడుతూ తమ తల్లిదండ్రుల వారసులుగా సేవ చేసే భాగ్యం కలిగినందుకు ఆనందంగా ఉందన్నారు. అఖిలభారత ఆదివాసీ, గిరిజన ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షుడు శేషాద్రి మాట్లాడుతూ కొయ్యూరులో గిరిజన భవనం దశాబ్దాల కల నెరవేర్చిన ఘనత ఎంపీ మాధవిదేనన్నారు. అనంతరం నూతన భవనానికి కామ్రేడ్ గొట్టేటి దేముడు స్మారక గిరిజన భవనంగా నామకరణం చేసిన శిలాఫలకం ఆవిష్కరించారు. అలాగే ఎంపీ మాధవి దంపతులకు గిరిజన ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘ నేతలు సత్కరించారు. నేను సైతం చారిటబుల్ ఫౌండేషన్ చైర్మన్ కె.శివప్రసాద్, ఎంపీపీ బడుగు రమేష్‌బాబు, జడ్పీటీసీ సభ్యుడు వారా నూకరాజు, ఏఎంసీ చైర్‌పర్సన్ రాజులమ్మ, సర్పంచ్‌లు సింహాచలం, బాలరాజు, ఎంపీటీసీ సభ్యులు మల్లికార్జున, అప్పారావు, గిరిజన సంక్షేమ శాఖ డీఈ రాజు, ఎంపీడీవో సీతయ్యనాయుడు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థులు అన్ని రంగాల్లో ముందుండాలి

గిరిజన విద్యార్థులు విద్యతో పాటు అన్ని రంగాల్లో ముందుండాలని ఎంపీ మాధవి ఆకాంక్షించారు. కొయ్యూరు రెజ్లింగ్ అకాడమీలోకి క్రీడాకారులకు రూ.10 లక్షలు వెచ్చించి షూస్, దుస్తులతో పాటు అకాడమీ నిర్వహణకు అవసరమైన సామగ్రిని పంపిణీ చేశారు. అలాగే గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాల-1కు రూ.30 లక్షల ఖరీదైన లేబొరేటరీ సామగ్రి అందచేశారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్ అవసరాలకు తనవంతు సహకారం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో రెజ్లింగ్ అకాడమీ కోచ్ నూకరాజు పాల్గొన్నారు.

గిరి యువత క్రీడల్లో రాణించాలి: ఏఎస్పీ ధీరజ్

పెదబయలు, మార్చి 6: యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని పాడేరు ఏఎస్పీ ధీరజ్ సూచించారు. పెదబయలు మండలం మారుమూల గోమంగి పంచాయతీ కేంద్రంలో యువహో మెగా వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ క్రీడల్లో 23 పంచాయతీ నుంచి 63 జట్లు వచ్చాయి. విజేత, రన్నర్స్, మూడో స్థానంలో నిలిచిన జట్లకు బహుమతులు, జ్ఞాపికలను అందజేశారు. టోర్నీలో పాల్గొన్న ఇతర జట్లకు టీ షర్టులు, వాలీబాల్ కిట్లు పంపిణీ చేశారు. అనంతరం ఏఎస్పీ ధీరజ్ మాట్లాడుతూ మారుమూల ప్రాంతాల అభివృద్ధికి పోలీసు శాఖ శ్రమిస్తుందన్నారు. పోలీసుల చొరవతో అనేక గ్రామాలలో రహదారులు, తాగునీటి కల్పనతో పాటు సాంకేతిక పరంగా అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజనులకు ఏ సమస్య వచ్చినా పోలీసు శాఖ ఎప్పుడు సిద్ధంగా ఉందని గమనించాలని ఆయన పేర్కొన్నారు. ప్రజా ప్రతినిధులు, ప్రజలు, యువత పాల్గొన్నారు.

ప్రజా ప్రతినిధులంటే అధికారులకు అలుసా?

» మండల సమావేశానికి గైర్హాజరు కావడంపై సభ్యుల ఆగ్రహం

» వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్



పంచాయతీరాజ్ శాఖ పనుల గురించి వివరిస్తున్న జేఈ శివరామయ్య

పెదబయలు, మార్చి 6: ప్రజాప్రతినిధులు అంటే అధికారులకు కనీస గౌరవం లేదని సభ్యులు వాపోయారు. మూడు నెలలకోసారి జరిగే సర్వసభ్య సమావేశానికి పలు శాఖల అధికారులు గైర్హాజరు కావడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వారిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయాలని ఎంపీడీవోను కోరారు. పెదబయలులోని ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఎంపీపీ వరహాలమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఉదయం 10 గంటలకు ప్రారంభం కావలసిన సమావేశం అధికారులు, సభ్యులు ఆలస్యంగా రావడంతో ఉదయం 11.24 గంటలకు ప్రారంభమైంది. పలు శాఖల అధికారులు గైర్హాజరు కావడంతో సభ్యులు మండిపడ్డారు. ఇప్పటి వరకు జరిగిన ఏ సమావేశంలో కూడా అన్ని శాఖల అధికారులు హాజరు కాలేదని, గతంలో జరిగిన సమావేశంలో ఫిర్యాదు చేసినా అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. కొన్ని శాఖల్లో మండల స్థాయి అధికారుల స్థానంలో కింద స్థాయి అధికారులు సమావేశానికి హాజరుకావడంతో సభ్యులు ఆగ్రహించారు. అనంతరం వైద్యశాఖ తీరుపై చర్చించారు. మారుమూల ప్రాంతాల్లో ఎంఎల్‌హెచ్‌పీలు విధి నిర్వహణలో అలసత్వం వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సికిల్‌సెల్ ఎనీమియాపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. మండలంలో నీటి సమస్య నివారణకు 15 సెగ్మెంట్‌లకు గాను 15 లక్షల రూపాయలు మంజూర య్యాయని, పనులు జరుగుతున్నాయని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కురేష్ తెలిపారు. వర్రెడా పంచాయతీ తిరంగి గ్రామంలో పక్కా రహదారి సౌకర్యం కల్పించాలని పంచాయతీరాజ్ జేఈని సర్పంచ్ రవి కోరారు. మండలంలో అనేక పాఠశాలల భవనాలు శిథిలావస్థకు చేరాయని, వాటికి మరమ్మతులు చేయాలన్నారు. ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు బొంజుబాబు మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం ద్వారా ప్రతీ కార్యాలయంలో నివేదిక బోర్డులు ఏర్పాటు చేయాలని కోరారు. ఎంపీడీవో విగ్గిన్స్, తహసీల్దార్ రాజమోహన్‌రావు, వైస్ ఎంపీపీ సోనే, రాజుబాబు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

వెబ్‌సైట్‌లో ఆదివాసీ ఉప తెగల తొలగింపు దుర్మార్గం

» 10న బంద్‌కు సీపీఐ, గిరిజన సమాఖ్య మద్దతు

» సీపీఐ జిల్లా కార్యదర్శి పొట్టిక సత్యనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ

పాడేరు రూరల్, మార్చి 6: ప్రభుత్వ వెబ్‌సైట్‌లో ఆదివాసీ ఉప తెగలను తొలగించడం దుర్మార్గమని సీపీఐ జిల్లా కార్యదర్శి పొట్టిక సత్యనారాయణ అన్నారు. పార్టీ జిల్లా కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఆదివాసీలను అణగదొక్కే ప్రయత్నమే జరుగుతున్నదని, ఇందులో భాగంగానే ఆదివాసీ ఉప కులాలను ప్రభుత్వ వెబ్‌సైట్ నుంచి తొలగించడమని చెప్పారు. కులాలను తొలగించడం చూస్తుంటే జగన్ ప్రభుత్వానికి ఆదివాసీలపై ఎంత మేర చిత్తశుద్ధి ఉందో స్పష్టమవుతుందన్నారు. అలాగే ప్రతీ ఏటా జనవరి నెలలో జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తానని జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ నీటి మూట కావడంతో గిరిజన యువత నిరుద్యోగులుగానే మిగిలిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో స్పెషల్ డీఎస్సీ ప్రకటించాలని ఈ నెల 10వ తేదీన తలపెట్టిన మన్యం బంద్‌కు తమ మద్దతు ఉంటుందని చెప్పారు. అలాగే ఆదివాసీ ప్రాంతంలో శతశాతం ఉద్యోగాలు ఆదివాసీలకే కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉందన్నారు. గిరిజన హక్కులను కాపాడాల్సిన జీవోలను రాష్ట్ర ప్రభుత్వం కాలరాయడం దారుణమన్నారు. ఇప్పటికైనా ఆదివాసీ ప్రాంతంలో నిరుద్యోగ యువతకు వంద శాతం ఉద్యోగాలను కేటాయించాలని, జీవో నెంబరు 3కు చట్ట బద్ధత కల్పించి ఆర్డినెన్స్ తీసుకురావాలని, ప్రభుత్వ వెబ్‌సైట్‌ల నుంచి తొలగించిన ఉప తెగలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్ర ప్రభుత్వానికి తగిన గుణపాఠం తప్పదని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సమాఖ్య జిల్లా ప్రతినిధులు కూడా రాధాకృష్ణ, సింహాచలం పాల్గొన్నారు.

మన్యంలో రూ.7.3 కోట్లతో అభివృద్ధి పనులు

» శిలాఫలకాలు ఆవిష్కరించిన ఎమ్మెల్యే, కలెక్టర్, ఐటీడీఏ పీవో



శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, కలెక్టర్ విజయసునీత, పీవో అభిషేక్

పాడేరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మన్యంలో రూ.7.3 కోట్లతో పలు అభివృద్ధి పనులకు అధికారులు, ప్రజా ప్రతినిధులు శ్రీకారం చుట్టారు. జిల్లా కలెక్టర్ విజయసునీత, ఐటీడీఏ పీవో అభిషేక్, ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మిలతో కలిసి రూ.2కోట్ల 82 లక్షలతో చేపట్టిన పనులకు ప్రారంభోత్సవాలు, రూ.4 కోట్ల 46 లక్షలతో చేపట్టే పనులకు శంకుస్థాపనలకు సంబంధించిన శిలాఫలకాలను ఐటీడీఏ ఆవరణలో బుధవారం ఆవిష్కరించారు. పాడేరు, అరకులోయ అసెంబ్లీ నియోజకవర్గాల్లో రూ.55 లక్షలతో నిర్మించిన 11 హాట్ బజార్లు, రూ.144 లక్షల వ్యయంతో నిర్మించిన తొమ్మిది వ్యవసాయదారుల ఉత్పత్తి కేంద్రాలు, రూ.50 లక్షలతో హుకుంపేట మండలం భీమవరంలో నిర్మించిన పబ్లిక్ హెల్త్ సెంటర్ యూనిట్, రూ.32.45 లక్షలతో నిర్మించిన ఐదు షేడ్ నెట్ వ్యవసాయ యూనిట్లకు ప్రారంభోత్సవాలు చేశారు. అలాగే జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో రూ.210 లక్షల వ్యయంతో పాడేరు మండలం కించూరు నుంచి వల్లాయి గ్రామానికి తారు రోడ్డు, కించూరు నుంచి బొంజంగి వరకు రూ.75 లక్షలతో తారురోడ్డు, బడిమెల నుంచి వల్లాయి గ్రామం వరకు రూ.160 లక్షల వ్యయంతో నిర్మించనున్న తారురోడ్డు పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీవోలు వీఎస్‌ప్రభాకరరావు, ఎం.వెంకటేశ్వరరావు, గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ శాఖ ఈఈలు డీవీఆర్‌ఎం.రాజు, కె.వేణుగోపాల్, డీఈఈ పి.అనుదీప్, డీఆర్‌డీఏ పీడీ వి.మురళి, జిల్లా వ్యవసాయాధికారి రమేశ్‌కుమార్‌రావు, ఎంపీపీలు రత్నకుమారి, రాజబాబు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులు ఉన్నత లక్ష్యాలు సాధించాలి

» ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి సూర్యలక్ష్మి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రాజెక్టు డైరెక్టర్ సూర్యలక్ష్మి

చింతపల్లి, మార్చి 6: విద్యార్థినులు విద్యలో ఉన్నత లక్ష్యాలు సాధించాలని, బాల్య వివాహాలకు దూరంగా ఉండాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ ఎన్.సూర్యలక్ష్మి సూచించారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం ఐసీడీఎస్ అధికారులతో డివిజన్ స్థాయి బేటీ బచావో, బేటీ పడావో కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా బాల్య వివాహాల నిషేధంపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ మహిళలకు విద్య చాలా అవసరం అన్నారు. ఆదివాసీ విద్యార్థినులు ఉన్నత ఉద్యోగాలు సాధించి కుటుంబానికి బాసటగా నిలవాలన్నారు. అలాగే తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల బలవంతం వల్ల బాల్య వివాహాలు చేసుకోరాదన్నారు. బాల్య వివాహాలకు తల్లిదండ్రులు బలవంతం చేస్తే అంగన్‌వాడీ కార్యకర్త, మహిళా కానిస్టేబుల్, ఐసీడీఎస్ అధికారులను ఆశ్రయించవచ్చున్నారు. జడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య మాట్లాడుతూ బాలికలను సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉన్నాయన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులు బాల్యవివాహాల వల్ల కలిగే నష్టాలపై ప్రదర్శించిన నాటికలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వీర సాయిబాబు, ఎంఈవో పనసల ప్రసాద్, ఏటీడబ్ల్యూవో జయనాగలక్ష్మి, ఉప తహసీల్దార్ రాజ్‌కుమార్, చింతపల్లి, కొయ్యూరు, జీకే వీధి సీడీపీవోలు బీవీ రమణ, విజయకుమారి, లక్ష్మిదేవి, ఏసీడీపీవో రామలక్ష్మి, సూపర్‌వైజర్లు సత్యవతి, గౌహర్ ఉన్నీష, విజయకుమారి, రామలక్ష్మి, అస్పలనర్స్, గౌరి, పాస్టర్ కాలేబు, అర్చకుడు సాయి పంతులు, ఎన్‌జీవో కాగి వెంకయమ్మ పాల్గొన్నారు.



జెండా ఊపి రథాలను ప్రారంభిస్తున్న కలెక్టర్, పీవో, ఎమ్మెల్యే

సికిల్‌సెల్ ఎనీమియా ప్రచార రథాలు ప్రారంభం

పాడేరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మన్యంలో సికిల్‌సెల్ ఎనీమియాపై ప్రచారాన్ని నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన మూడు ప్రచార రథాలను స్థానిక ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, ఐటీడీఏ పీవో వి.అభిషేక్‌తో కలిసి కలెక్టర్ ఎం.విజయసునీత బుధవారం ప్రారంభించారు. సికిల్‌సెల్ ఎనీమియాపై ప్రజల్లో మరింత చైతన్యం తీసుకురావాలని కలెక్టర్ సూచించారు. గత వారం ఐటీడీఏ పీవో వి.అభిషేక్ రెండు ప్రచార రథాలను ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీపీ ఎస్.రత్నకుమారి, హుకుంపేట ఎంపీపీ కె.రాజబాబు, పలువురు ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

దారంతా గోతులు

... 5వ పేజీ తరువాయి

పెదగూడ వెళ్లే క్రమంలోనూ ఈ మెయిన్‌రోడ్డులోనే ఆమె సైతం ప్రయాణిస్తుంటారు. అయినప్పటికీ మార్గంపై దృష్టి సారించిన దాఖలాలు లేవు. పాడేరు నుంచి పెదబయలు, ముంచంగిపుట్టు మండలాలకు, అటుగా ఒడిశా రాష్ట్రానికి రాకపోకలు సాగించేందుకు ముఖ్యమైన పాడేరు- ముంచంగిపుట్టు మార్గం అభివృద్ధిపై ప్రజాప్రతినిధులు ప్రత్యేక శ్రద్ధ కనబరచకపోవడం ఘోరమని ప్రయాణికులు, వాహనాల డ్రైవర్లు, స్థానికులు అంటున్నారు. ఇప్పటికైనా పాడేరు-ముంచంగిపుట్టు మెయిన్‌రోడ్డును మెరుగుపరచాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

అంగరంగ వైభవంగా శివరాత్రి మహోత్సవాలు

» శివపార్వతుల కల్యాణానికి మోదకొండమ్మ ఆలయం నుంచి పట్టు వస్త్రాలు



స్వామివారి కల్యాణంలో ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి

పాడేరు రూరల్, మార్చి 6: పట్టణంలోని అతిపురాతన శైవక్షేత్రం ఉమానీలకంఠేశ్వరుని ఆలయంలో మహా శివరాత్రి వేడుకలు బుధవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు నిర్వహించే ఉత్సవాలకు ఆలయాన్ని రంగులు, విద్యుత్ అలంకరణలతో ముస్తాబు చేశారు. బుధవారం ఉదయం నుంచి ఆలయంలో వేదపండితుల మంత్రోశ్చరణల మధ్య ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహిస్తున్నారు. బుధవారం ఉదయం ఆలయంలో చేపట్టిన శివపార్వతుల కల్యాణ మహోత్సవానికి వందలాది జంటలు హాజరయ్యారు. సంప్రదాయ ప్రకారం బుధవారం సాయంత్రం ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం మోదకొండమ్మ ఆలయం నుంచి శివపార్వతుల కల్యాణానికి ఆలయ ప్రధాన కార్యదర్శి కొట్టగుల్లి సింహాచలం నాయుడు, రమాదేవి దంపతులు భక్తులతో కలిసి పట్టు వస్త్రాలు, సారెను భారీ ఊరేగింపుగా తీసుకువచ్చి ఆలయ ప్రధాన అర్చకులు ఉప్పల రామంపంతులుకు అందించారు. సాయంత్రం వేదపండితులు హోమాన్ని నిర్వహించి శివపార్వతుల కల్యాణాన్ని అత్యంత వైభవంగా చేపట్టారు. ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, నరసింగరావు దంపతులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, భక్త బృంద సభ్యులు, గ్రామ పెద్దలు, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘ నాయకులు, వర్తక సంఘ ప్రతినిధులు, వందలాది మంది భక్తులు పాల్గొన్నారు.

హుకుంపేటలో శివరాత్రి ఉత్సవాలకు సర్వం సిద్ధం



ఉత్సవాలకు సిద్ధం చేసిన ఆలయ ముఖ ద్వారం

హుకుంపేట: గిరిజనులకు ఆరాధ్య దైవం మత్యలింగేశ్వస్వామి ఆలయం వద్ద మహాశివ రాత్రి వేడుకలకు కమిటీ సభ్యులు సర్వం సిద్ధం చేశారు. మూడు రోజులు జరిగే శివరాత్రులకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారు. గంగ స్నానాలు వద్ద ప్రమాద ప్రదేశాలకు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. పాడేరు నుంచి మత్యగుండం వచ్చే భక్తులకు ప్రత్యేక బస్సు సర్వీసు కూడా ఉంటుందని కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేకంగా పార్కింగ్‌లు సిద్ధం చేస్తామన్నారు. భక్తులు మొక్కులు చెల్లించుకుని విజయవంతం చేయాలని కోరారు.

☛ సంక్షిప్తంగా..

డొంకరాయి పవర్ కెనాల్ పనులు వేగవంతం: ఈఈ విజయ్ కుమార్

సీలేరు, మార్చి 6: డొంకరాయి పవర్ కెనాల్ మరమ్మతు పనులను వేగవంతం చేశామని ఏపీ జెన్‌కో డొంకరాయి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ విజయ్‌కుమార్ తెలిపారు. బుధవారం పవర్ కెనాల్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఈఈ మాట్లాడుతూ ఇప్పటికే పవర్ కెనాల్ పనులు పూర్తి చేయాల్సి ఉందన్నారు. అయితే పనులు పూర్తి కావడానికి మరో 24 గంటల సమయం కావాలని కోరారని, దీనికి జెన్‌కో అధికారులు అనుమతించారని చెప్పారు. గురువారం ఉదయం నుంచి డొంకరాయి పవర్ కెనాల్ ద్వారా ట్రైల్ రన్‌గా నీటిని విడుదల చేస్తామన్నారు. అలాగే డొంకరాయి పవర్ కెనాల్ ఒకటి, రెండు రీచ్‌లలో జరుగుతున్న పనులను సీలేరు కాంప్లెక్స్ సీఈ బి.శ్రీధర్, ఇన్‌చార్జి ఎస్ఈ వరప్రసాద్ పరిశీలించారు.

సచివాలయ సేవలు వినియోగించుకోండి

సీలేరు, మార్చి 3: ఆదివాసీలు గ్రామ సచివాలయం సేవలను సద్వినియోగం చేసుకోవాలని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి కోరారు. ధారకొండ పంచాయతీ కేంద్రంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం భవనాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సచివాలయం వ్యవస్థ ద్వారా ప్రజలకు ప్రభుత్వ సేవలను అందుబాటులోకి వచ్చాయన్నారు. అలాగే ధారకొండలో 460 ఆర్‌వోఎఫ్ఆర్ పట్టాలు పంపిణీ చేశామన్నారు. ఆదివాసీలకు అండగా ఉంటున్న వైసీపీకి మరో అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఉమామహేశ్వరరావు, పీఆర్ ఏఈఈ కిల్లో జ్యోతిబాబు, ఎంపీపీ బోయిన కుమారి, జడ్పీటీసీ సభ్యురాలు శివరత్నం, సర్పంచ్ నడిగట్ల రాజు, సీలేరు సర్పంచ్ దుర్గో పాల్గొన్నారు.

'పాడేరులో టీడీపీదే విజయం'

చింతపల్లి, మార్చి 6: పాడేరు నియోజకవర్గంలో టీడీపీదే విజయమని పార్టీ మండల అధ్యక్షుడు కిల్లో పూర్ణచంద్రరరావు అన్నారు. మండల కేంద్రం సాయినగర్‌లో బుధవారం బాబూ ష్యూరిటీ, భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో టీడీపీకి పూర్వ వైభవం వచ్చిందన్నారు. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో గిరిజనుల అభివృద్ధిని విస్మరించిందన్నారు. ఈ కారణంగా ఆదివాసీలు వైసీపీపై తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారన్నారు. ప్రస్తుతం ప్రతి గ్రామంలోనూ టీడీపీకి ప్రజాదరణ భారీగా పెరిగిందన్నారు. వచ్చే ఎన్నికల్లో జనసేన, టీడీపీ ఉమ్మడి అభ్యర్థి విజయం దాదాపు ఖరారైపోయినట్టేనని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు రీమల ఆనందరావు, ఆంధ్రాబు లక్ష్మణ్, అరడా వీరబాబు, నాగం నాయుడు, మంగు, గెవింద్, గణపతి పాల్గొన్నారు.

ప్రత్యేక డీఎస్సీ ప్రకటించాలి

చింతపల్లి, మార్చి 6: వైసీపీ ప్రభుత్వం ప్రత్యేక డీఎస్సీ ప్రకటించాలని గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పాంగి ధనుంజయ్ డిమాండ్ చేశారు. బుధవారం చింతపల్లి వారపు సంతలో ఈ నెల 10న తలపెట్టిన రాష్ట్ర మన్యం బంద్‌ను విజయవంతం చేయాలని కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఆదివాసీ నిరుద్యోగ యువతకు తీరని అన్యాయం జరిగిందన్నారు. దేశ అత్యున్నత న్యాయస్థానం రద్దు చేసిన జీవో నంబరు -3ని పునరుద్ధరించేందుకు కనీస చర్యలు తీసుకోవడం లేదన్నారు. తాజాగా జగన్ ప్రభుత్వం ప్రకటించిన దగా డీఎస్సీలోనూ ఆదివాసీ నిరుద్యోగులకు అన్యాయం జరిగిందన్నారు. వేల సంఖ్యలో నిరుద్యోగులు ఉద్యోగాల కోసం ఎదురుచూస్తుంటే పదుల సంఖ్యలో ఉద్యోగాలు కేటాయించడం బాధాకరమన్నారు. ప్రభుత్వం దిగొచ్చే వరకు ఆదివాసీ నిరుద్యోగ యువత ఐక్యతగా పోరాడాలన్నారు. మన్యం బంద్‌కు అన్ని వర్గాల ప్రజలు పూర్తి సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నేత చిరంజీవిపడాల్ పాల్గొన్నారు.

ఏడో రోజుకు విద్యా వలంటీర్ల దీక్షలు

పాడేరు రూరల్, మార్చి 6: ఆదివాసీ మాతృ భాష విద్యా ప్రమాణాలు మెరుగుకు కృషిచేస్తున్న విద్యా వలంటీర్ల సమస్యల పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఐటీడీఏ ఎదురుగా చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారానికి ఏడో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ అధికారులకు, ప్రజా ప్రతినిధులకు ఎన్ని వినతులు అందించినా స్పందించకపోవడం విచారకమన్నారు. ఇప్పటికైనా మార్చి, ఏప్రిల్ నెలల్లో విధుల్లో కొనసాగించాలని, ప్రతీ విద్యా సంవత్సర సకాలంలో రెన్యువల్ చేయాలని, వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రభుత్వంపై పోరాటం చేయక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు చంద్రయ్య, కె.కొండయ్య, కె.గణేష్, పి.వెంకట్, పి.దేవి, వి.రాధ పాల్గొన్నారు.

'ఇంటి పన్నుల వసూళ్లలో గ్రామ వలంటీర్ల పాత్ర సరికాదు'

డుంబ్రిగుడ, మార్చి 6: ఇంటి పన్నులు వసూళ్లలో గ్రామ వలంటీర్లు అత్యుత్సాహన్ని చూపి పేద ప్రజల నుంచి ముక్కు పిండి వసూలు చేయడం సరికాదని మాజీ సర్పంచ్ సుబ్బారావు, టీఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి స్వామి అన్నారు. బుధవారం విలేకరులతో వారు మాట్లాడుతూ నాలుగన్నరేళ్ల వైసీపీ పాలనలో పంచాయతీల నిధులను మళ్లించి అభివృద్ధికి దూరం చేసిందని చెప్పారు. ఇంటి పన్ను పేరుతో ప్రజలపై బారాలను మోపడం సిగ్గుచేటన్నారు. వీధి దీపాలు నాలుగున్నరేళ్లుగా ఒక్క గ్రామానికి బిగించలేదని, ఇలాంటిది వీధి దీపాల పన్నును విధించడం సమంజసం కాదని పేర్కొన్నారు.

విద్యుత్ తీగలు పడి రెండు ఎద్దుల మృతి

పెదబయలు, మార్చి 6: విద్యుత్ తీగలు తెగిపడి రెండు పశువులు మృతి చెందాయి. పెదకోడపల్లి పంచాయతీలోని జయంతికోట నుంచి కుసుమగరువు మీదుగా పెదగొంది గ్రామానికి వెళుతున్న విద్యుత్ తీగలు పోతురాజు గుడి సమీపంలో తెగిపడ్డాయి. ఈ సమయంలో జయంతికోట గ్రామానికి చెందిన పూజారి రమేష్‌కుమార్, పూజారి రవికుమార్‌ల రెండు ఎద్దులపై తీగలు పడ్డాయి. దీంతో షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాయి.